క్లుప్తంగా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్థసారధితో కలిసి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. అర్జీదారుడి సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎంలు శర్మ, ప్రసాద్

ఒంగోలు సిటీ: తిరుపతిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో ఒంగోలులోని రామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. భాను, స్నేహ, జ్యోత్స్న, నిహారిక, సారిక, హోసన్నలు సత్తా చాటగా, వారిని హెచ్‌ఎం శర్మ, ప్రైమరీ హెచ్‌ఎం కట్టా ప్రసాద్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

మోసపూరిత ప్రకటనలపై చర్యలు తీసుకోవాలి



జిల్లా అటవీశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నాగులుప్పలపాడు: ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కల పేరుతో రియల్ ఎస్టేట్ రంగాల్లో ప్రజలను మభ్యపెడుతున్నారని, అనుమతులు లేని అలాంటి వెంచర్లపై చర్యలు తీసుకోవాలని ఏపీ రియల్ ఎస్టేట్ ఏజెంట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విన్నకోట సురేష్‌బాబు సోమవారం జిల్లా అటవీశాఖ అధికారి వినోద్ కుమార్‌ను కోరారు. జిల్లాలో చాలా చోట్ల ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కల పెపంకం పేరుతో సారవంతంకాని నేలల్లో పండిస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అలాంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీలు అనీల్, శ్రీను పాల్గొన్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో నేడు జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ ఇండ్ బ్యాంక్, విజన్ ఇండియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పార్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ప్లానింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ, ఆపై విద్యార్హత, ఐటీఐ, డిప్లమో విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. అర్హులైన వారికి రూ.12 వేల నుంచి రూ.28 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. అదేవిధంగా ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు గ్రామంలోని అరుంధతీనగర్లో ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు టి.ఆనంద్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ద్వారా ఏబీసీడీ వర్గీకరణ సాధన సందర్భంగా ఈ జెండాను అవిష్కరించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాలపర్తి రవికుమార్, నాయకులు అట్లూరి అశోక్, పాలపర్తి శీను, వెటర్నరీ వైద్యుడు ఎం.తిరుపాల్, రిటైర్డ్ టీచర్ ఏ అమ్మయ్య, ట్రాన్స్‌కో ఏఈ వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఏ సింగయ్య, ఏ రామారావు, ఆర్టీసీ ఉద్యోగి అన్నంగి సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు వి.రూబెన్, ఏ ఎల్లమంద, ఏ బెన్ను, సంజీవరావు, బి.డానియల్, ఆదిశేఖరరావు, అంజయ్య, ఎల్లమంద, వెంకటేశ్వర్లు, దావీదు, నాగేశ్వరరావు, సుబ్బారావు, శీను, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో డిప్యుటేషన్ల డ్రామా..!



సంతనూతలపాడు మండల రెవెన్యూ కార్యాలయం



సిబ్బంది కొరత కారణంగా పనులు నిలిచిపోవడంతో కార్యాలయంలో పేరుకుపోయిన ఫైళ్లు

- సంతనూతలపాడు మండలం నుంచి ఒంగోలుకు భారీగా డిప్యుటేషన్లు
- మండలంలో సిబ్బంది కొరతతో నిలిచిపోయిన పనులు
- ఎక్కడి ఫైళ్లు అక్కడే ఆగిన వైనం
- సమస్యల నిలయంగా మండల రెవెన్యూ కార్యాలయం

సంతనూతలపాడు: రెవెన్యూ శాఖలో డిప్యుటేషన్ల పేరుతో అధికారులు, ఉద్యోగులు తమకు కావాల్సిన ప్రాంతాలకు విధులు మార్పించుకుంటున్నారు. అందుకోసం పైస్థాయిలో పైరవీలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతులు కూడా తడుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి డిప్యుటేషన్ల కారణంగా సంతనూతలపాడు మండలంలో రెవెన్యూ సిబ్బంది కొరత ఏర్పడి ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు సకాలంలో సేవలు అందకుండా తీవ్ర జాప్యం జరుగుతోంది.

భారీగా డిప్యుటేషన్ల జాబితా...

పేరుకేమో సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగం.. కానీ పనిచేస్తోంది మాత్రం ఒంగోలులో.. మండలంలో ఈ జాబితా భారీగానే ఉంది. చాలామంది రెవెన్యూ ఉద్యోగులు డిప్యుటేషన్లపై ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ తహసీల్దార్ షేక్ రఫీ ఒంగోలు ఆర్డీఓ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌రెడ్డి కూడా ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలోనే ఉన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, రీ సర్వే డీటీ పోస్టులు ఖాళీగా ఉండి ఆయా విధులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయి.

అసలే వీఆర్వోల కొరత...

మండలంలో అసలే వీఆర్వోల కొరత వేధిస్తోంది. గుమ్మలంపాడు, బొడ్డువారిపాలెం, ఎనికపాడు, మద్దులూరు, పేర్నమిట్టలో 4 వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా గ్రామాలకు వీఆర్వోలు లేకపోవడంతో ఇతర గ్రామాల వీఆర్వోలను ఇన్‌చార్జిలుగా నియమించారు. మంగమూరు వీఆర్‌ఓ వినోద్ డిప్యుటేషన్‌పై ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అదేవిధంగా ఇద్దరు అటెండర్లకు ఒకరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో అటెండర్ కొండయ్య ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో ప్రధానంగా కోర్టు కేసులు, సమాచార హక్కు ఫిర్యాదులు అధికంగా ఉంటున్నాయి. మండలంలోని పేర్నమిట్ట పరిధిలో జిల్లా, హైకోర్టు కేసులు అధికంగా ఉన్నాయి. ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట, మంగమూరు ఏరియాలలో భూముల విలువ కోట్ల రూపాయల్లో ఉండటంతో పాటు ఎంతో కాలంగా ఆన్‌లైన్ సమస్యలు, పాస్ పుస్తకాలు, ఎండార్స్, కన్వెన్షన్, సర్వే కొలతల సమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. ఆయా భూములకు సంబంధించి రెండో వ్యక్తి జిల్లా కోర్టు, హైకోర్టులలో కేసులు వేస్తున్నారు. పూర్తి వివరాలకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇటీవలే బాధ్యతలు తీసుకున్న సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్‌ఎల్ నారాయణరెడ్డి గతంలో పెండింగ్లో ఉన్న 100కుపైగా మ్యుటేషన్ అర్జీలను వీఆర్వోలతో వేగంగా పరిష్కరించినప్పటికీ ఇంకా పెండింగ్ పనులు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని సమాచారం. ప్రధానంగా కొందరు ఉద్యోగులు డిప్యుటేషన్లు వేయించుకుని ఒంగోలులో పనిచేస్తుండటంతో సంతనూతలపాడు మండలంలో సిబ్బంది కొరత కారణంగా పనులన్నీ నిలిచిపోయినట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల కొరత లేకుండా చూడాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాధాదేవి

సంతనూతలపాడు: మహిళలు ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ రాధాదేవి సూచించారు. సంతనూతలపాడులోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాదేవి మాట్లాడుతూ మహిళలు తక్కువ ఖర్చు, ఎక్కువ పోషక విలువలు కలిగిన బెల్లం, వేరుశనగపప్పులు, కొబ్బరి లాంటి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ధైర్యవంతులుగా ఉంటూ పిల్లలకు మంచి ఆహారం అందించాలన్నారు. మంచి అలవాట్లు నేర్పాలని చెప్పారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే సంతనూతలపాడులో కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళ సమస్యలపై నిరంతరం ఐద్వా పనిచేస్తోందని, మహిళలు ఐక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు ఐద్వా ఆధ్వర్యంలో పోషక విలువలు కలిగిన మందులను పంపిణీ చేశారు. ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి, టైలరింగ్ టీచర్ సీహెచ్ అనూరాధ పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు

చీమకుర్తి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, సమ్మె కాలం నాటి ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు గత ఏడు సంవత్సరాల నుంచి జీతాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదంటూ వాపోయారు. సీఐటీయూ నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా కోట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

ఒంగోలు టౌన్: ఆగస్టు చివరి వరకు కోట హనుమంతరావు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా కొనసాగుతారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతుల వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక వైశ్యాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది జూన్ 14 నుంచి ఈ ఏడాది జూన్ వరకు కోట హనుమంతరావు, ఆ తర్వాత బొగ్గవరపు సుబ్బారావు అధ్యక్షులుగా వ్యవహరించే విధంగా పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందం జరిగిందని తెలిపారు. అయితే వైశ్యాభవన్‌లో కొన్ని పనులు జరుగుతున్న నేపథ్యంలో కోట హనుమంతరావును ఆగస్టు చివరి దాకా కొనసాగేలా సంఘ పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు. సెప్టెంబర్ నుంచి సుబ్బారావు బాధ్యతలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య నాయకులు శిద్దా పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఖతార్‌లో వెల్డర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు

ఒంగోలు వన్‌టౌన్: ఖతార్ దేశంలో వెల్డర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జే రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 24 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఐటీఐ, ఐటీసీ విద్యార్హతతో కనీసం నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. ఏఆర్‌సీ మల్టీ వెల్డర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.52 వేల నుంచి రూ.61 వేల వేతనం ఉంటుందన్నారు. ఏఆర్‌సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42 వేల నుంచి రూ.52 వేల వరకూ ఉంటుందని చెప్పారు. రెండు సంవత్సరాలకు కాంట్రాక్టు ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒక సారి వచ్చి తిరిగి వెళ్లడానికి టిక్కెట్ సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పాస్‌పోర్టు, అనుభవం సంబంధిత విద్యార్హత పత్రాలతో జూలై 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 8125215216, 8790117279 అనే నంబరుపై సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ అక్రమ వాడకంపై దాడులు



దాడుల వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

● రూ.15.50 లక్షల అపరాధ రుసుం విధించిన విజిలెన్స్ అధికారులు

చీమకుర్తి: విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం చీమకుర్తిలోని పలు విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. 20 మంది అధికారులు, 60 మంది సిబ్బంది కలిసి 45 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారి నుంచి మొత్తం రూ.15.50 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఈఈ ఆపరేషన్స్ ఎం.హరిబాబు మీడియాకు తెలిపారు. అనుమతిచ్చిన విద్యుత్ కంటే అదనంగా వాడుకున్న వారికి సంబంధించి 307 సర్వీస్‌లపై రూ.14.10 లక్షల అపరాధ రుసుం ఉన్నట్లు తెలిపారు. మీటర్ ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారు, మీటరు లేకుండా నేరుగా విద్యుత్ వాడుకున్న వారిని గుర్తించి వారి నుంచి రూ.1.20 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఈఈ టీ హైమావతి, ఒంగోలు, చీమకుర్తి డీఈఈలు ఆర్.మోహన్‌రావు, పాండురంగారావు, వెంకటేశ్వర్లు, ఏఈలు చంద్రశేఖరరావు, కోటేశ్వరరావు, కోటయ్య, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

● ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి



వార్షిక ప్రణాళికపై సమావేశమైన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తపట్నం: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే పంచాయతీల్లో వార్షిక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి సూచించారు. కొత్తపట్నంలో సోమవారం వార్షిక ప్రణాళిక తయారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక ఏడాదికి వార్షిక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ప్రతి రైతు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు సాగుచేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా మన ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అంతేగాకుండా పెట్టుబడులు తగ్గించుకుని ఆదాయం చూడవచ్చన్నారు. విత్తన దశ నుంచి కోత దశ వరకు ప్రకృతి కషాయాలు వాడుకుని పంటలు సాగుచేయాలని సూచించారు. భూమి లేనివారు కనీసం ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు ఏసమ్మ, వీవోఏ ప్రత్యూష, మహిళా సంఘాల సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

ఒంగోలు మెట్రో: గణపతికి ప్రీతికరమైన సంకటహరచతుర్థి పూజలను సోమవారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలోని రాజాపానగల్ రోడ్డులో గల లక్ష్మీ గణపతి దేవస్థానంలో, బాపూజీ కాంప్లెక్స్‌లోని గణపతి దేవస్థానంలో, కర్నూలు రోడ్డు శ్రీనగర్ కాలనీలోని విజయ గణపతి దేవస్థానంలో, సమతానగర్, మణికంఠ నగర్ కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న వరసిద్ధి వినాయక గణపతి దేవస్థానంలో, కర్నూల్ రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఉన్న సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి దేవస్థానంలో, కర్నూల్ రోడ్ ఫ్లై ఓవర్ దగ్గర ఉన్న గణపతి మందిరంలో ఆలయ అర్చకులు ఉదయం మూలవిరాట్లకు ఆవు పాలు, పెరుగు, తేనె, పంచదార, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ చేసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులతో స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు

సహకార సంఘాలకు కమిటీల ఎంపిక



మండవ ఆంజనేయులు

నాగులుప్పలపాడు: సహకార సంఘాలకు ప్రభుత్వం కొత్తగా త్రీ మ్యాన్ కమిటీలను నియమించింది. మండలంలోని 9 సహకార సంఘాలకు కమిటీలు నియమించారు. మండలంలోని పెద్ద సహకార సంఘంగా పేరొందిన ఓబన్నపాలెం సొసైటీకి అధ్యక్షునిగా మండవ ఆంజనేయులు, డైరెక్టర్లుగా ఈదర రాజా, భీమవరపు వెంకటేశ్వర్లు, తిమ్మసముద్రం సొసైటీలకు అధ్యక్షునిగా మన్నెం శివ నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా పెంట్యాల కోటేశ్వరరావు, మండవ మురళి, ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షునిగా కాట్రగడ్డ చంద్రబాబు, డైరెక్టర్లుగా మసిముక్కు భాస్కరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, నిడమానూరు సొసైటీ అధ్యక్షునిగా నలమలపు అంకిరెడ్డి, డైరెక్టర్లుగా లక్కెనబోయిన శిరోమణి, నిమ్మల వెంకట్రావు, చదలవాడ సొసైటీ అధ్యక్షునిగా కేశిన నాగరాజు, డైరెక్టర్లుగా జాగర్లమూడి హరిబాబు, స్వర్ణ యలమంద నియమితులయ్యారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ



స్టడీ చైర్స్ అందుకున్న విద్యార్థులతో దాతలు

ఒంగోలు సిటీ: స్థానిక బాలాజీ నగర్ మున్సిపల్ పాఠశాలను ఫ్యామిలీ క్లబ్ మెంబర్స్ సందర్శించి పదో తరగతి చదువుతున్న 34 మంది పిల్లలకు 30 వేల రూపాయల విలువైన స్టడీ చైర్స్‌ను సోమవారం అందించారు. పాఠశాలలో 9, 10 చదువుతున్న విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ అందించారు. పాఠశాలకు శాశ్వత దాతలుగా ఉండడానికి ముందుకొచ్చారు. ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీర రాఘవరావు ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో మొదటి స్థానంలో నిలిచిన స్టూడెంట్లకు రూ.10,116, 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం ద్వితీయ స్థానంలో నిలిచిన స్టూడెంట్‌కు రూ.5116, ఆర్‌ఎస్ ఫ్యాషన్స్ శ్రీనివాసరావు తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2116 చొప్పున ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బంకా లక్ష్మీప్రసన్న, ఫ్యామిలీ క్లబ్ మెంబర్లయిన కార్పొరేటర్ నాగభూషణం, కూనంశెట్టి చక్రవర్తి, చిత్తారి నరేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాములకు నేత్రపర్వంగా తిరుమంజనం



సీతారామ మందిర అన్నకూటోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక పత్తివారివీధిలోని రామ మందిరంలో సోమవారం ఉదయం సీతారాములకు తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. నిర్వాహకులు ముందుగా సీతారాముల ఉత్సవ మూర్తులను వేదికపై కొలువుదీర్చి వేదమంత్రోచ్చారణల నడుమ తిరుమంజనాన్ని నేత్రపర్వంగా జరిపించారు. అనంతరం దేవేరులను చక్కగా తీర్చిదిద్ది విశేష పూజాకైంకర్యాలు జరిపించారు. అనంతరం సీతారాములకు అభిముఖంగా అన్నకూటోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. రాసిగా పోసిన అన్నాన్ని భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేవూరి శ్రీనివాసులు, పబ్బిశెట్టి సత్యమూర్తి, దేసు నరసింహారావు, నల్లమల్లి దామోదరరావు, తడవర్తి కృష్ణ, పబ్బిశెట్టి బద్రి తదితరులు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహ పరిణయం



స్వామివారు, అమ్మవార్ల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక పప్పుబజార్లోని సీతారామ మందిరం ఎదురుగా శ్రీ లక్ష్మీనరసింహ కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీతారామ మందిరం 65వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి వివిధ రకాల పుష్పాలతో చక్కగా అలంకరించిన కల్యాణ మండపంపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని కొలువుదీర్చారు. భక్తుల హర్షధ్వానాల మధ్య అర్చకులు శుభముహూర్తాన స్వామి, అమ్మవార్లకు కంకణధారణ చేశారు. దేవేరులకు జీలకర్ర, బెల్లం ఉంచి కన్యాదానం చేశారు. భక్తజన సందోహం నడుమ అమ్మవారికి మాంగల్య ధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడి క్రతువులను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారు, అమ్మవార్ల కల్యాణాన్ని కనులారా తిలకించారు. సీతారామ బాల భక్త సమాజం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఒంగోలు సబర్బన్: ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదేశించారు. మంగళవారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ పరీక్షల ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 6 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ నిరంతరాయంగా ఉండాలని మునిసిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ విజయకుమార్, డీపీఓ వెంకటనాయుడు, పోలీసు, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ ప్రతినిధులు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

సంతనూతలపాడు: మండలంలోని గంగవరం గ్రామంలో శాంతినికేతన్ పాఠశాల గ్రౌండ్లో స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు తానిపర్తి సుబ్బారెడ్డి జయంతి సందర్భంగా ఒంగోలులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి పర్యవేక్షణలో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ తానిపర్తి మదన్ తెలిపారు. మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.